క్లుప్తంగా

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న ఎంఈవో లజపతిరాయ్

కడియం: ఒంటిపూట బడుల సందర్భంగా మండలంలోని వేమగిరి తోట–1 ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎంఈవో వి.లజపతిరాయ్, ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేశారు. హెచ్ఎం కె.జయరాజు మాట్లాడుతూ స్కూలు చివరి పనిదినం వరకు ప్రతిరోజూ ఈ మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శివాలయానికి సౌండ్‌సిస్టం అందజేత



సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న దాత సూరిబాబు

కడియం: మాధవరాయుడుపాలెంలో ఇటీవల నూతనంగా ప్రారంభమైన శివాలయానికి ఉండమట్ల సూరిబాబు రూ.లక్ష విలువైన సౌండ్ సిస్టమ్‌ను సోమవారం అందజేశారు. దాన్ని గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి చేతుల మీదుగా ఆలయానికి అప్పగించారు. ఆలయ ప్రాంగణంలో నిత్యం శివనామస్మరణ వినిపించేందుకు దీన్ని వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుల్లా రామారావు, అడపా సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చిలుకూరి



కడియం: ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జిల్లా నుంచి కడియం గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో యూటీఎఫ్ ఎన్నికలు జరిగాయి. ఈ మేరకు వివరాలను సోమవారం చిలుకూరి స్థానిక విలేకరులకు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఉన్న తనను రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎంపిక చేశారన్నారు.

పోలీసు స్పందనకు 17 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రజనీ

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 17 అర్జీలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ నేరుగా మాట్లాడారు. సమస్యలను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

కోత, కుట్టు లేకుండా గర్భసంచి తొలగింపు



శస్త్రచికిత్స అనంతరం పేషెంట్‌తో వైద్యులు

కంబాలచెరువు: కోత, కుట్టు లేకుండా 140 కేజీల బరువు ఉన్న మహిళ శరీరం నుంచి గర్భసంచి తొలగించే ఆపరేషన్‌ను స్థానిక రాయల్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆ వివరాలను ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. నాన్ డిసెన్డెవేగినల్ హిస్టెక్టమీ పద్ధతిలో డాక్టర్ దీపక్ ఆధ్వర్యంలో ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ వాసిరెడ్డి ప్రసాద్, డాక్టర్ బిందు, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ శివ ఈ శస్త్ర చికిత్సను నిర్వహించారు.

10న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న మూడు మోటారు వాహనాలు, ఒక ట్రైసైకిల్‌కు ఈనెల 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 91777 44055 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నగరానికి మరో మణిహారం

- చౌడేశ్వర్ నగర్‌లో గ్లోథీమ్ పార్క్
- రూ.3 కోట్లతో ఏర్పాటు
- దేశంలోనే మూడోది



గాంధీపురంలో రూపుదిద్దుకుంటున్న గ్లోథీమ్ పార్కు నమూనా

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అభివృద్ధిలో భాగంగా లాలాచెరువు సమీపంలోని గాంధీపురం – 4లో గ్లోథీమ్ పార్కు ఏర్పాటు కాబోతోంది. ఈ పార్కును గుజరాత్, తెలంగాణ తర్వాత ఇక్కడే తయారు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాడుబడిపోయిన పార్కులు, నేటి ప్రభుత్వ చొరవతో సుందరంగా తయారవుతున్నాయి. వీటిలో లాలాచెరువు మున్సిపల్ పార్కు ఒకటి. మొన్నటి వరకు ఖాళీగా ఉన్న మైదానం నేడు ఎక్కడా లేని విధంగా గ్లోథీమ్ పార్కుగా మారిపోతోంది. దీనికి సంబంధించి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పార్కు జూలై నెలాఖరుకు అందుబాటులోకి రానుంది. ఆ దిశగా సంబంధిత అధికారులు ముందుకు వెళుతున్నారు. సాధారణంగా పార్కుల్లో ఉచిత ప్రవేశం ఉంటుంది. అయితే గ్లోథీమ్ పార్కులో ప్రవేశానికి సాధారణ రుసుము వసూలు చేయనున్నారు.

సమస్యగా మారిన వాకింగ్ ట్రాక్

ఇప్పటివరకు గాంధీపురం – 4 పార్కు మొత్తం ఖాళీగా ఉండడంతో చుట్టూ పెద్ద వాకింగ్ ట్రాక్ ఉండేది. నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి పార్కులో ఉన్న జిమ్‌తో పాటు నడక, పలు రకాల వర్కవుట్లు చేసుకునేవారు. అయితే గ్లో పార్కు నిర్మాణంతో ప్రస్తుతం వాటికి ఆటకం ఏర్పడనుంది. దీంతో ఆ ప్రాంత వాసులు దీన్ని ఇష్టపడడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న పార్కు అభివృద్ధి అధికారులు.. డిజైన్‌కు అనుకూలంగా, గ్లోపార్కు నిర్మాణానికి అడ్డులేకుండా, నిత్యం వచ్చి వాకింగ్ చేసే వారికి అందుబాటులో ఉండేవిధంగా 300 మీటర్ల వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు.

రూ.3 కోట్లతో నిర్మాణం

రాష్ట్రంలోనే మొదటిగా, ఇండియాలోనే మూడోదిగా గ్లోథీమ్ పార్కు ఏర్పాటు కాబోతోంది. ఇప్పటికే సగం వరకు పనులు పూర్తయ్యాయి. సివిల్ వర్కుకు రూ.90 లక్షలు, లైటింగ్ వర్కుకు రూ.2 కోట్లు నిధులు కేటాయించారు. ఈ వ్యయం పెరిగే అవకాశం ఉండోచ్చని పార్కు నిర్మాణ అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం నగరానికే వన్నె తెచ్చే విధంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

త్వరలో అందుబాటులోకి..



గతంలో గాంధీపురం 4 పార్కు పిచ్చి మొక్కలతో ఉండేది. అది నేడు ఒక రోల్ మోడల్‌లా, ఇండియాలోనే మూడోదిగా గ్లోథీమ్ పార్కుగా మారడం చాలా సంతోషంగా ఉంది. పార్కు అభివృద్ధికి గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులను కలిసి విన్నవించాం. పార్కులోని చెత్తా చెదారాన్ని శుభ్రం చేసి, ఆ ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. నగరానికే తలమానికంగా తయారవుతున్న గ్లోథీమ్ పార్కు మరికొద్ది నెలల్లో అందుబాటులోకి రానుంది.

– గుత్తుల మురళీధర్, మాజీ కార్పొరేటర్

సహకార సంఘాలను పునఃవ్యవస్థీకరించాలి

- ప్రభుత్వ నిర్ణయాలతో అక్రమాలు
- మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రైతుల కోసం ఏర్పాటైన సహకార సంఘాలు నష్టాల బాటపడుతున్నాయని, వాటిని తక్షణమే పునఃవ్యవస్థీకరించాలని టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా సహకార డివిజన్‌లో పనిచేస్తున్న 19 డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి పోస్టులను రద్దుపరిచారన్నారు. కొవ్వూరు, ఏలూరు, భీమవరంలో క్రిందిస్థాయి అధికారులను ఇన్‌చార్జి అధికారులుగా నియమించామన్నారు. దీని కారణంగా సొసైటీల్లో జరుగుతున్న అవకతవకలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగిస్తామన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వకుండా పార్టీ నుంచి ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ బెదిరింపుల కారణంగా ఎంపీ గల్లా జయదేవ్ వచ్చే ఎన్నికల్లో దూరంగా ఉంటానని ప్రకటించారన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గత ఆర్థిక సంవత్సరానికి చెందిన పన్నుల వసూలు పూర్తి చేయడంలో సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం ద్వారా లక్ష్యాలను సాధించడం సాధ్యమైందన్నారు. పారిశుధ్యం నిర్వహణ విషయంలో సచివాలయ సిబ్బంది మరింత మెరుగైన పనితీరు చూపాలన్నారు. స్పందన కార్యక్రమంలో 15 అర్జీలను స్వీకరించామన్నారు. అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, ముఖ్య పట్టణ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు పాల్గొన్నారు.

బీసీ నాయకుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న నాయకులు

ప్రకాశం నగర్: రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ కమిషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం జంతర్ మంతర్ వద్ద బీసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేష్, జిల్లా నాయకులు రాకేష్, బూడిద శరత్ కుమార్, డాక్టర్ అనుసూరి పద్మలత, మార్గాన్ని సుశీల, ఏలూరు విజయలక్ష్మి, తాతా కృష్ణారావు, పెంకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

11 నుంచి క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ కప్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రకాశం నగర్: మహాత్మా జ్యోతీరావు పూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బత్తిన సుబ్బారావు సేవా సమితి అధ్యక్షుడు బర్రే కొండబాబు తెలిపారు. సోమవారం స్థానిక క్వారీ మార్కెట్ సుబ్బారావు నగర్‌లో రాజమహేంద్రవరం గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కానుబోయిన సాగర్, కొండబాబు తదితరులు క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 27వ తేదీ వరకు టోర్నమెంట్ జరుగుతుందని, అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. టోర్నమెంట్‌ను ఎంపీ భరత్ రామ్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో గారా చంటి, ఉల్లూరి రాజు, బూరాడ భవానీ శంకర్, ఆరే చిన్ని, సుబ్బరాజు, ముత్యాల పెదబాబు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల సందడి



బొమ్మూరు జీపీఆర్ స్కూల్లో స్క్రైబ్‌తో కలిసి పరీక్షకు హాజరవుతున్న అంధవిద్యార్థిని

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం విద్యార్థుల సందడి నెలకొంది. రూరల్ మండలంలోని 14 కేంద్రాల్లో తొలిరోజు తెలుగు పరీక్షకు 2,882 మంది విద్యార్థులకు 14 మంది గైర్హాజరయ్యారు. బొమ్మూరు జీపీఆర్ హైస్కూల్లో అంధ విద్యార్థి స్క్రైబ్‌తో పరీక్షకు హాజరయ్యారు. పదో తరగతి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్యశిబిరంతో పాటు తాగునీరు అందుబాటులో ఉంచారు. మండల విద్యాశాఖాధికారి తులసీదాస్ పరీక్షాకేంద్రాలను పర్యవేక్షించారు.

కడియం మండలంలో..

కడియం: తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 993 మందికి గాను మొదటి పరీక్షకు 989 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో వి.లజపతిరాయ్ తెలిపారు. కడియం ఏ సెంటర్‌లో ఇద్దరు, వీరవరంలో ఇద్దరు విద్యార్థులు పరీక్షలు రాయలేదన్నారు. కడియపులంక సెంటర్‌లో సీసీ సర్వైలెన్స్‌లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. కడియం పోలీసు స్టేషన్ నుంచి బందోబస్తు మధ్య పరీక్షా పేపర్లను మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాలకు తరలించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు వెంకటస్వామి నగర్, వడ్డీలపేట ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని రూరల్ అసెంబ్లీ బీజేపీ కోకన్వీనర్ యానాపు ఏసు ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం ఏఎస్పీ ఎం.రజనికి వినతి పత్రం అందజేశారు. చాలాకాలంగా కుటుంబ సమేతంగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, పొరుగున ఉన్న వాంబే గృహ సముదాయంలో కొన్ని బ్లాకులు ఖాళీగా ఉండగా, పక్కనే ఉన్న దానవాయి బాబు గుడి, పాత కరెంట్ కార్యాలయం నిర్మానుష్యంగా ఉన్న కారణంగా అవి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయన్నారు. అక్కడ కొందరు దారిన పోయే మహిళలతో అగౌరవంగా ప్రవర్తిస్తున్నారని, పేకాట, గంజాయి వాడకం పెరిగిందన్నారు.

పన్నులు సకాలంలో చెల్లిస్తే నగరాభివృద్ధి

- రూ. 574.61 కోట్ల బడ్జెట్‌కు ప్రతిపాదన
- కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్

సీటీఆర్ఐ: పన్నులు సకాలంలో చెల్లిస్తే నగరాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌కు సంబంధించి రూ.574.61 కోట్ల అంచనా ప్రతిపాదనను రూపొందించామన్నారు. రూ.167.43 కోట్ల ప్రారంభ నిల్వ, జమలు రూ.407.18 కోట్లు వెరసి రూ.574.61 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందన్నారు. గత ఏడాది రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను రూ.560.95 కోట్ల నుంచి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలు రూ.485.16 కోట్లను అంశాల వారీ వివరించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాదికి సంబంధించి ముగింపు నిల్వ రూ.160.88 కోట్ల నుంచి రూ.167.43 కోట్ల రావడం జరిగిందన్నారు. నగర పరిధిలో 32 కిలోమీటర్ల రహదారులను ఎండ్ టు ఎండ్ విధానంలో అభివృద్ధి చేయడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించగలుగుతామన్నారు. నగరపాలక సంస్థ ఆస్తులైన గ్రిల్స్ తదితర మౌలిక పరికరాలను కొందరు ఉద్దేశపూర్వకంగా తరలిస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నగర పరిధిలో అన్ని సీసీ కెమెరాలు పనిచేసేలా ఏర్పాటు చేస్తున్నామని, కంట్రోలు రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామన్నారు.

అంచనా వివరాలు...

వివిధ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఉద్యోగస్తుల జీతభత్యాల కోసం రూ.427.59 కోట్లు అంచనా వేయగా, ముగింపు నిల్వను రూ.147.02 లక్షలుగా చూపామని దినేష్ కుమార్ తెలిపారు. నగరపాలక సంస్థ చెందిన ముఖ్యమైన రాబడి వివరాలు తెలియజేస్తూ ఆస్తిపన్ను ద్వారా రూ.58 కోట్లు, ఖాళీ స్థలాల ద్వారా రూ.13 కోట్లు, స్టాంప్ డ్యూటీపై సర్‌చార్జి కింద రూ.12 కోట్లు, నీటిపన్ను ద్వారా రూ.12 కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. 2022–23లో ఆస్తిపన్ను అంచనాకు తగ్గట్టుగానే వసూలైందన్నారు. కంబాల చెరువును ఆధునీకరించి, స్టోరేజీ కెపాసిటీ ఎక్కువ చేస్తున్నట్లు తెలిపారు. హేవలాక్ వంతెనకు లైటింగ్ కోసం రూ.70 కోట్ల రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర నగర్, కోటిలింగాల పేటలలో నీటి సరఫరా కోసం ట్యాంకులు నిర్మించడానికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనరు జి.సాంబశివరావు, టౌన్ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, ఎగ్జామినర్ ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు: సెంట్రల్ జైలులో ఖైదీల తాగునీటి కోసం ఓఎన్జీసీ ఇచ్చిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంట్రల్ జైలుకి రూ.2,83,200 విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఓఎన్‌జీసీ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీఐజీ ఎంఆర్ రవి కిరణ్, జైలు సూపరింటెండెంట్ కె.రాజారావు, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్, చీఫ్ జనరల్ మేనేజర్ నవేద్‌రావు, జనరల్ మేనేజర్ ఎస్పీ జగన్నాథరావు, సీఎస్ఆర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ నిర్మల రాబర్ట్ పాల్గొన్నారు.

నేడు కన్నమాంబ జాతర మహోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక నరసింహారావుపేట(ఆల్కాట్‌తోట)లోని కన్నమాంబ పేరంటాలమ్మ జాతర మహోత్సవం మంగళవారం సాయంత్రం నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఇందులో భాగంగా అమ్మవారి చల్లఘటాలతో ఊరేగింపుగా రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కన్నమాంబ గుడికి చేరుకుంటారు. పూల గరగలు, సేవ గరిడి గుర్రాలు, వివిధ వేషధారణల మధ్య వైభవంగా కార్యక్రమం జరుగుతుంది.

కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ

గోకవరం: కల్తీమాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం పశుసంవర్ధక శాఖ డీడీ కె.సత్యనారాయణ హెచ్చరించారు. గోకవరంలో కల్తీమాంసం విక్రయాలను అరికట్టాలని గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఆయన గోకవరంలో మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాంసం విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అధికారుల పర్యవేక్షణలో విక్రయాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అన్ని రకాల మాంసం విక్రయాలు ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివలన ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇకపై గోకవరంలో విక్రయించే మేక మాంసంపై కచ్చితంగా సీలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కల్తీ మాంసం విక్రయించినట్టు ఫిర్యాదులు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు గోకవరంలో మాంసం దుకాణాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని, దీనివలన ప్రజలు పలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి కేటాయించిన స్థలాల్లో మాంసం విక్రయాలు నిర్వహించుకునే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్ఎస్ మూర్తి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ



బ్యాడ్మింటన్‌లో విజేతలు

రాజానగరం: విజయవాడలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు ×స్కోప్స్ అలెంటా–23 । పేరిట జరిగిన ఫార్మసీ అంతర్ కళాశాలల పోటీలలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బ్యాడ్మింటన్ (డబుల్స్)లో విన్నర్స్‌గా, క్రికెట్‌లో రన్నర్స్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. విజేతలుగా తిరిగి వచ్చిన రెండు టీమ్‌లను సోమవారం అభినందించారు.

సోదరులుగా సమస్యలను పరిష్కరించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు

బిక్కవోలు: సోదరులుగా సమస్యలను పరిష్కరించుకుందామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన నాగరాజు(బాజ్జి)అన్నారు. సోమవారం మండలంలోని ఆర్ఎస్‌పేట, బిక్కవోలు లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు గరక వెంకటరాజు అధ్యక్షతన జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే అన్నదమ్ములుగా కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలే తప్ప అసోసియేషన్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించొద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాకపల్లి స్వామినాయుడు, ఉపాధ్యక్షుడు గౌతు అర్జుబాబు, సంయుక్త కార్యదర్శి బి.త్రిమూర్తులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొలుగూరి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కంబాలచెరువు: న్యాయవాదిపై జరిగిన దాడికి సంబంధించి ఒకటో పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న తనపై పోలీసులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని న్యాయవాది దుగ్గిరాల సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ సంఘటనలో ఎస్సై నారాయణ విధులకు ఆటంకం కలిగించాడంటూ సుభాష్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సుభాష్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేసింది. ఎట్టకేలకు న్యాయవాది సుభాష్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.